సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం । 29 । జూలై । 2023



పడగ విప్పిన ప్రమాదం

వర్షాల రాకతో ఖరీఫ్ సాగు నేపథ్యంలో పాములు గడ్డిమాటున దాగి ఉండే అవకాశమున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. -8లో



ముగిసిన క్రీడా పోటీలు

రాజంపేట మండలపరిధిలోని నారనరాజు పల్లిలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో గత రెండు రోజులుగా జరుగుతున్న క్రీడా పోటీలు శుక్రవారంతో ముగిశాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.1400	రూ.1640
రెండోరకం	రూ.1160	రూ.1390

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 280 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	430	460
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 427 కిలోలు

న్యూస్‌రీల్

బాధ్యతల స్వీకారం



ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన రామకృష్ణారెడ్డి

రాజంపేట రూరల్: రాజంపేట ఆర్డీఓగా జి.రామకృష్ణారెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నంద్యాల నుంచి ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా ప్రణాళికాబద్ధంగా పనిచేస్తానన్నారు.

కమిటీలు ఏర్పాటు చేసుకోవాలి



ఆస్పత్రి అభివృద్ధి కమిటీల ఏర్పాటుపై వైద్యులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

మదనపల్లె: ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు ఆస్పత్రి అభివృద్ధి కమిటీలు ఏర్పాటుచేసుకోవాలని జిల్లా జాతీయ ఆరోగ్యమిషన్ పర్యవేక్షణ అధికారి లోకవర్ధన్ అన్నారు. మదనపల్లెలోని నిమ్మనపల్లె రోడ్, అమ్మచెరువుమిట్ట, త్యాగరాజవీధి, దొంతివీధి, రామారావుకాలనీ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ వైద్యాధికారులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు, డీఈఓలకు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఏర్పాటు, నిర్వహణ, సమావేశాలు, నెలవారీగా నిర్వహించడం, నిధులు ఎలా? ఎందుకు ఖర్చుచేయాలి? కమిటీలో ఎంతమంది సభ్యులు ఉంటారు. బ్యాంక్‌ఖాతాలు ఎలా ప్రారంభించాలి, నిర్వహించాలనే విషయమై ఎన్‌హెచ్ఎం సీనియర్ అసిస్టెంట్ గిరిధర్‌రెడ్డి అవగాహన కల్పించారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



మాట్లాడుతున్న వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : కడప నగరంలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ ఫెయిర్‌కు విద్యార్థులు, నిరుద్యోగ అభ్యర్థుల నుంచి చక్కటి స్పందన లభించింది. ఈ మేళాను వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్ ప్రారంభించారు. చదువుకునే సమయంలోనే ఉద్యోగ, ఉపాధికి అవసరమైన నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని యువతకు సూచించారు. కళాశాల కరస్పాండెంట్, వైవీయూ పాలకమండలి సభ్యుడు జి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరిన్ని మేళాలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు రెండురౌండ్లు ఇంటర్వ్యూలు, గ్రూప్ డిస్కషన్ నిర్వహించి పలు ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కాగా, జాబ్‌మేళాలో ఉద్యోగాలు సాధించిన 450 మంది విద్యార్థులకు మేయర్ సురేష్‌బాబు నియామక పత్రాలను అందజేశారు.



నా పేరు నిర్మల. మాది వాయల్పాడు మండలం, వాల్మీకిపురం, అన్నమయ్య జిల్లా. గ్రామ సమైక్య అందులో గాయత్రి గ్రూపులో మహిళా సభ్యురాలిని. మేము ఇక్కడ చేయూత మహిళామార్ట్ ఏర్పాటు చేసుకున్నాం. డ్వాక్రా సంఘ సభ్యులందరం కలిసి ఒక్కొక్కరు రూ.300 వాటా ధనంగా వసూలు చేసి మార్ట్ పెట్టాం. తక్కువ ధరకు నాణ్యమైన సరుకులు అందజేస్తున్నాం. దీంతో మార్ట్‌కు ఆదరణ పెరుగుతోంది. ప్రతి సంవత్సరం ఆడిట్ జరిపి వచ్చిన లాభాలను సంఘ సభ్యులకు ఇవ్వడం జరుగుతుంది.ఈ మార్టు పెట్టడానికి కారణమైన ఏపీఎం నుంచి ఏసీ, పీడీ, కలెక్టర్, ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.



నా పేరు ఉమామహేశ్వరి, సంఘ మిత్ర మహిళా సభ్యురాలిని. మా మండలంలో మొత్తం 10,000 గ్రూపులు ఉన్నాయి. అందరం కలిసి ఒక్కొక్కరు రూ.300 వాటా ధనంగా వసూలు చేసి మార్ట్ పెట్టాం. ఇందులో ప్రతి రోజు లక్ష రూపాయలకు పైగా వ్యాపారం జరుగుతోంది. ఈ అవకాశం కల్పించిన అధికారులందరికీ ధన్యవాదాలు.



నా పేరు మునిరత్నమ్మ. వాయల్పాడు మండలంలో మహిళా చేయూత మార్ట్ గత ఏడాది నవంబర్ 28న ప్రారంభించాం. ప్రారంభంలో ప్రతిరోజు ఒక లక్ష చొప్పున వ్యాపారం జరిగేది. దీంతో సభ్యులందరికీ ఉపయోగకరంగా ఉంది. అతి తక్కువ ధరలకు నాణ్యతమైన వస్తువులు ఇస్తున్నాం. కాబట్టి సభ్యులందరూ ఇక్కడికే వచ్చి నిత్యావసర సరుకులు కొంటున్నారు. చేయూత మహిళా మార్ట్ నడిపిస్తున్న వారికి ధన్యవాదాలు.

మహిళా శక్తికి చేయూత

- 'చేయూత మార్ట్'తో ఆర్థిక స్వావలంబన
- నాణ్యమైన సరుకులు అందించడం. ఎమ్మార్పీకే వస్తువులు
- రాష్ట్రంలోనే అధిక విక్రయాలు చేసే మార్ట్‌గా వాయల్పాడు



మహిళా మార్ట్ నిర్వహిస్తున్న స్వయం సహాయక సంఘ మహిళలు

సాక్షి రాయచోటి : స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక సాధికారత దిశగా ప్రభుత్వం వేస్తున్న అడుగులు సత్ఫలితాలిస్తున్నాయి. మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రారంభించిన 'చేయూత మహిళా మార్ట్'లు విజయవంతంగా నడుస్తున్నాయి. మహిళ షేర్ హోల్డర్‌గా వారి ఆధ్వర్యంలోనే వీటిని నిర్వహిస్తున్నారు. ప్రత్యేక సొసైటీ ద్వారా పర్యవేక్షిస్తూ ఉండడంతో వ్యాపారం పారదర్శకంగా సాగుతోంది. బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరకే నాణ్యమైన నిత్యావసర వస్తువులు విక్రయిస్తున్నారు. దీంతో మహిళా మార్ట్‌ను ప్రజలు ఆదరిస్తున్నారు.

జిల్లాలో 30,382 మహిళా స్వయం సహాయక సంఘాలు

అన్నమయ్య జిల్లావ్యాప్తంగా 30,382 మహిళ స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిలో 3,48,400 మంది సభ్యులు ఉన్నారు. అన్ని నియోజకవర్గాల్లో మహిళా మార్ట్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. మార్ట్ ఏర్పాటు చేసే ప్రాంతంలోని సంఘాల్లో ఉన్న సభ్యుల నుంచి ఉత్సాహవంతులైన పదిమందిని బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లుగా ఎన్నుకుంటారు. గత ఏడాది నవంబర్ నెలలో అన్నమయ్య జిల్లా వాయల్పాడులో మండల సమాఖ్య పరిధిలో 1,583 స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో రూ.38 లక్షల పెట్టుబడితో మహిళా మార్ట్‌ను ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. ఇందులో డ్వాక్రా ఉత్పత్తులతోపాటు బయట వస్తువులు కూడా బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. తాజా ఉత్పత్తులకు ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారు. నిత్యవసరాలు సరఫరా చేసే రైతులకు గిట్టుబాటు ధర దక్కేలా చూస్తున్నారు. మహిళలకు అవసరమైన అన్ని రకాల వస్తువులు సరసమైన ధరకే అందిస్తున్నారు. కేవలం నాలుగు శాతం నుంచి ఐదు శాతం మాత్రమే లాభం వేసుకొని సరుకులు విక్రయిస్తున్నారు. దీంతో అనతి కాలంలోనే మంచి ఆదరణ లభించింది. ఈనెల 20 తేదీ నాటికి ఈ మార్ట్ మొత్తం 248 రోజులపాటు పనిచేయగా, రోజుకు సగటున రూ.లక్షకు పైగా విక్రయాలు జరిగాయి. ఇప్పటివరకు రూ.1,57,14,830 మేర వ్యాపారం లభించింది. ఫలితంగా పొదుపు మహిళలకు ప్రయోజనం చేకూరుతోంది. రాష్ట్రంలోనే అధిక విక్రయాలు చేసే మార్ట్‌గా వాయల్పాడు నిలిచింది. జిల్లాలో రెండు మార్ట్‌లు ఏర్పాటయ్యాయి. త్వరలో నాలుగు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

మరిన్ని మార్ట్‌ల ఏర్పాటుకు చర్యలు



మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. జిల్లాలో డ్వాక్రా మహిళలు బలమైన ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నారు. మండల సమాఖ్యల ఆధ్వర్యంలో జీవనోపాధి కార్యకలాపాలు ముమ్మరం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అందులో భాగంగా మరిన్ని మహిళా మార్ట్‌ల పేరుతో సూపర్‌బజార్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. . జిల్లాలో మరిన్ని మహిళా మార్ట్ లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– పీఎస్ గిరీషా, జిల్లా కలెక్టర్, రాయచోటి, అన్నమయ్య జిల్లా

అంతరాయాల పర్యవేక్షణకు కాల్ సెంటర్లు

ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు



మాట్లాడుతున్న ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు

తిరుపతి రూరల్: రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఎస్పీడీసీఎల్) సీఎండీ సంతోష రావు సూచించారు. తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భారీ వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాలో ఎదురయ్యే అంతరాయాలను పర్యవేక్షించడానికి సర్కిల్ కేంద్రాల్లోని సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్/టెక్నికల్ నియంత్రణలో ఈ పర్యవేక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటికే ఉన్న టోల్ ఫ్రీ నెంబరు 1912 కు అదనంగా ఈ కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. భారీ వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయాలకు సంబంధించిన అన్ని పనులు పూర్తయ్యే వరకు 24 గంటలు పర్యవేక్షణా కేంద్రాలు పని చేస్తాయని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, స్తంభాలు/నియంత్రికలు దెబ్బతినడంతో పాటు ఇతర విద్యుత్ సరఫరా సంబంధిత సమస్యలను పరిష్కరించుకునేందుకు ఆయా సర్కిల్ పరిధిలో ఈ క్రింది నంబర్లను సంప్రదించవలసిందిగా వినియోగదారులకు సూచించారు.

నెల్లూరు: 94408 17468

తిరుపతి: 9440817412

కడప: 94408 17440

అనంతపూర్: 94910 67446

కర్నూలు: 73826 14308

మానవజాతికి సిగ్గుచేటు

- మణిపూర్ ఘటనపై వెల్లువెత్తిన నిరసన
- కడపలో సర్వమతస్తుల ర్యాలీ



ర్యాలీగా వస్తున్న సర్వమతస్తులు



కార్యక్రమంలో పాల్గొన్న నగర వాసులు

కడప కల్చరల్: మణిపూర్ మారణకాండ సర్వమానవాళి సిగ్గుపడాల్సిన అంశమని కడప నగర మేయర్ సురేష్‌బాబు అన్నారు. మణిపూర్‌లో చోటుచేసుకున్న అశాంతి, మహిళల పట్ల తీరును నిరసిస్తూ శుక్రవారం కడప నగరం ఏడురోడ్ల కూడలిలో అన్ని మతాలకు చెందిన ప్రతినిధులు, సభ్యులు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ సురేష్‌బాబు మాట్లాడుతూ మణిపూర్‌లో చోటుచేసుకున్న దుస్సంఘటనలు మరెక్కడా జరగకూడదని, ఇవి మానవ జాతి మొత్తం సిగ్గుతో తలదించుకోవాల్సిన అంశమన్నారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం శాంతినే కాంక్షిస్తున్నదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇలాంటి ఘటనలను తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. మహిళలకు రక్షణ లభించినపుడే సమాజం శాంతియుతంగా ఉంటుందని, ఇలాంటి అరాచకాలు మానవత్వానికి మాయని మచ్చగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్బీ అహ్మద్‌బాషా మాట్లాడుతూ ఏ మతమైనా శాంతినే కోరుతుందని, మతంకంటే మానవత్వమే గొప్పదని అన్నారు. మణిపూర్ లాంటి సంఘటనలు మరెక్కడా జరగకుండా అన్ని మతాల ప్రజలు ఐక్యంగా కృషి చేయాలని, సమాజంలో అశాంతి రేగితే అన్ని మతాల ప్రజలకు నష్టమే వాటిల్లుతుందని నగరానికి చెందిన అన్ని పార్టీలు, అన్నిమత సంఘాల ప్రతినిధులు, సభ్యులు అన్నారు. అర్చక పురోహిత ప్రముఖులు విజయభట్టర్ ఈ సందర్భంగా శాంతిమంత్రం పఠించి దేశంలో శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు.

భారీ ర్యాలీ

మణిపూర్‌లో అశాంతి, అరాచక సంఘటనలను నిరసిస్తూ జరిగిన ఈ కార్యక్రమానికి నగరానికి చెందిన అన్నిమతాల ప్రముఖులు, సంఘాల సభ్యులు హాజరయ్యారు. వారి వారి ప్రార్థనా స్థలాల నుంచి బయలుదేరి మణిపూర్ సంఘటన మానవజాతికి సిగ్గుచేటు అంటూ ప్లకార్డులు చేతబట్టి ర్యాలీగా సాగారు. అందరూ ఏడురోడ్ల కూడలి వద్దకు చేరుకుని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పులి సునీల్‌కుమార్, అఫ్జల్‌ఖాన్, సుభాన్‌బాషా, డాక్టర్ సొహైల్, టీడీపీ నాయకులు అమీర్‌బాబు, శ్రీనివాసులురెడ్డి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

వర్షాలపై సమీక్షలో కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : భారీ వర్షాల హెచ్చరికతో జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు. ఈ సందర్భంగా వరదలు, పునరావాస చర్యలపై ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్షలో రాయచోటి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లు హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ వర్షాలు అధికంగా కురిసి వరదలు సంభవిస్తే ఆ ప్రాంతాల్లో అధికారులు పర్యటించాలన్నారు. సహాయ కార్యక్రమాల్లో భాగంగా లోతట్టు, ముంపు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు సహాయ శిబిరాలకు తరలించేందుకు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేసేలా ఉండాలని అధికారులను ఆదేశించారు.

అట్రాసిటీ కేసులపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సాంఘీక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం అమలుపై జిల్లా నిఘా పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్‌లో ఆయన అధ్యక్షతన నిర్వహించారు. అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేసి కేసుల్లో జాప్యాన్ని నివారించి సత్వర న్యాయం అందించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు ఎక్కడ అన్యాయం జరిగినా అధికారుల దృష్టికి తీసుకురావాలని డీవీఎంసీ కమిటీ సభ్యులకు సూచించారు.

ఓటరు జాబితా రూపొందించండి

అన్నమయ్య జిల్లాలో తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఆర్డీఓలు తహసీల్దార్‌లను ఆదేశించారు. శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఆయన పలు వివరాలు తెలుసుకున్నారు. నియోజకవర్గ, మండలాలవారీగా ఉన్న జంక్, సున్నాడోర్ సెంటర్ ఓట్లు ఎన్ని గుర్తించారు, అందులో ఉన్న ఓటర్ల సంఖ్య ఎంత, ఎన్ని కేసులు పరిశీలించారు, ఎన్నింటిని సరి చేశారన్న విషయంపై కలెక్టర్ ఆరా తీశారు. ఆగస్టు 21లోగా తప్పులు లేని ఓటర్ జాబితాను రూపొందించాలన్నారు. కాగా, ఆయా సమావేశాల్లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, రాయచోటి, మదనపల్లి, రాజంపేట ఆర్డీఓలు రంగస్వామి, మురళీ, రామకృష్ణారెడ్డి, కలెక్టరేట్ ఏఓ బాలకృష్ణ, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి



మొక్కలు నాటి నీరు పోస్తున్న కలెక్టర్ సతీమణి స్నేహ

పర్యావరణాన్ని కాపాడే బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. నక్కవాండ్లపల్లె సమీపంలో నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియం ఆవరణలో జిల్లా ఎస్పీ గంగాధర్ రావు, జేసీ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషతో కలిసి శుక్రవారం ఆయన మొక్కలు నాటారు. ఐఏఎస్‌ఓడబ్ల్యూఏ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ సతీమణి స్నేహ, ఎస్పీ సతీమణి పద్మజ, జేసీ సతీమణి ఖుష్నుమాబేగం, మున్సిపల్ కమిషనర్ సతీమణి లావణ్యలతో పాటు ఆర్డీవో రంగస్వామి, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, డ్వామా పీడీ మద్దిలేటి, డీఈవో శ్రీరాం పురుషోత్తం, ఏపీఐఐసీ డైరెక్టర్ రాయవరం శ్రీనివాసుల రెడ్డి, తహసీల్దార్ ప్రేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుప్పం.. శరవేగం

- చకచకాల సాగుతున్న కేబీసీ పనులు
- టీడీపీ హయాంలో తీవ్ర నిర్లక్ష్యం
- ప్రస్తుతం అత్యంత ప్రాధాన్యం
- భూసేకరణ, పనులకు రూ.100 కోట్లు మంజూరు



టన్నెల్ పనులు



గుడిపల్లె మండలం ఒంటుపల్లె వద్ద సాగుతున్న కాలువ పనులు

బి.కొత్తకోట: మాజీ సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న చిత్తూరుజిల్లా కుప్పం నియోజకవర్గానికి కృష్ణా జలాలను వచ్చే అక్టోబర్‌లో తరలించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఏపీఆర్ హంద్రీ-నీవా ప్రాజెక్టు రెండో దశలో అంతర్భాగంగా చేపట్టిన కుప్పం ఉప కాలువ పనుల (కేబీసీ)ను గత టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి వదిలేసింది. దీంతో ప్రస్తుత ప్రభుత్వం కుప్పంకు కృష్ణా జలాలను తరలించాలన్న ఆశయంతో ఉంది. ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో పనులన్నీ పూర్తయ్యాక శ్రీసత్యసాయిజిల్లా కదిరి సమీపంలోని చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలను తరలించి ట్రయల్‌రన్ నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేస్తోంది. పనులు సత్వరమే పూర్తి చేసేలా మిగిలిన భూసేకరణకు ఈనెల 23న రూ.40 కోట్లు, పనులకు రూ.60 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. రూ.430.27కోట్లతో చేపట్టిన కుప్పం ఉపకాలువ చిత్తూరుజిల్లా పలమనేరు నియోజకవర్గంలోని పెద్దపంజాణీ మండలం అప్పినపల్లె చెరువు వద్ద ప్రారంభమై కుప్పం నియోజకవర్గంలోని పరమసముద్రం చెరువులో కలుస్తుంది. పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లోని వీ.కోట, రామకుప్పం, శాంతిపురం, గుడిపల్లె, కుప్పం, గంగవరం, పెద్దపంజాణీ, బైరెడ్డిపల్లె మండలాల్లో 6,300 ఎకరాలకు ఆయకట్టు, 4.02లక్షల మంది జనాభాకు తాగునీరు అందించి, 110 చెరువులకు కృష్ణా జలాలను అందించాలన్నది ప్రణాళిక. దీనికి 1.10 టీఎంసీల నీటిని తరలించాలని ప్రతిపాదించారు. 143 కిలోమీటర్ల కాలువ పనులు, 3 ఎత్తిపోతల పథకాల నిర్మాణం, 285 కల్వర్టులు, బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలి. అయితే గత టీడీపీ పాలనలో ఉపకాలువ పనులను పూర్తి చేయించే విషయంలో మాజీ సీఎం చంద్రబాబు నిర్లక్ష్యంతో కాంట్రాక్టు సంస్థ పనులు నిలిపివేయగా పట్టించుకోలేదు.

ప్రస్తుతం.. పనులు చకా చకా

ప్రస్తుత ప్రభుత్వం కుప్పంకు కృష్ణా జలాలను తరలించాలన్న కృతనిశ్చయంతో అసంపూర్తి పనులను చేపట్టి పూర్తి చేయించే దిశగా అడుగులు వేస్తోంది. కుప్పం ఉపకాలువ పనులను ప్రభుత్వం చకా చకా చేయిస్తోంది. గత టీడీపీ హయాంలో ఆగిపోయిన అసంపూర్తి పనులను ప్రభుత్వం గత కాంట్రాక్టు సంస్థ ఒప్పందం మేరకే ఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్ సంస్థకు అప్పగించి అదనంగా భారం పడకుండా చేసింది. రూ.62.98 కోట్ల విలువైన సివిల్ పనులు ఆగిపోగా వాటిని రూ.63.31 కోట్లకు, రూ.33.89 కోట్ల విలువైన మెకానికల్ పనులను రూ.36.09 కోట్లకు అప్పగించారు. ఈ పనులు చేపట్టిన ఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్ సంస్థ పనులు వేగవంతం చేసింది. రూ.37.11 కోట్ల సివిల్ పనులు, రూ.8.36 కోట్ల మెకానికల్ పనులు పూర్తయ్యాయి. రూ.27.20 కోట్ల సివిల్ పనులు, రూ.27.73 కోట్ల మెకానికల్ పనులు జరుగుతున్నాయి. 4.8 కిలోమీటర్ల అసంపూర్తి కాలువ పనిలో 4.22 కిలోమీటర్ల కాలువ పూర్తయ్యింది. 112 పెండింగ్ స్ట్రక్చర్స్ నిర్మాణాల్లో 38 పూర్తి చేయగా, 49 నిర్మాణాలు సాగుతుండగా, 25 పనులు చేపట్టాల్సి ఉంది. ఈ పనులను సెప్టెంబర్‌లోగా పూర్తి చేయించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి..

శ్రీసత్యసాయిజిల్లా కదిరి సమీపంలో చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి ప్రారంభమయ్యే హంద్రీ-నీవా ప్రాజెక్టు రెండో దశలోని పుంగనూరు ఉపకాలువ అన్నమయ్యజిల్లాలోని తంబళ్లపల్లె నియోజకవర్గం మీదుగా మదనపల్లె, చిత్తూరుజిల్లాలోని పుంగనూరు నియోజకవర్గం మీదుగా పలమనేరు నియోజకవర్గం పెద్దపంజాణీ మండలంలోని అప్పినపల్లె వరకు సాగుతుంది. ఇక్కడి నుంచే కుప్పం ఉపకాలువ ప్రారంభమై..కుప్పం నియోజకవర్గంలోని పరమసముద్రం చెరువులో కలిసి ముగుస్తుంది. కుప్పం కాలువ పూర్తయ్యాక చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలను తరలించేందుకు ప్రాజెక్టు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకొంటున్నారు. అక్టోబర్ రెండో వారంలో ఎట్టి పరిస్థితుల్లో ట్రయల్‌రన్ పూర్తి చేసి కుప్పంకు కృష్ణా జలాలు తరలించాలని చర్యలు చేపట్టారు. రెండురోజుల క్రితం జలవనరులశాఖ ఉన్నతస్థాయి అధికారులు నిర్వహించిన సమీక్షలోనూ సత్వరమే కుప్పం కాలువ పనులు పూర్తిచేసి నీళ్లు ఇవ్వాలని నిర్ణయించారు.

అక్టోబర్‌లో నీళ్లిస్తాం

కుప్పం నియోజకవర్గానికి అక్టోబర్ రెండోవారంలో కృష్ణా జలాలు ఇవ్వాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనికి అనుగుణంగా పనుల్లో వేగం పెంచాం. రెండునెలల్లో మిగులు పనులు పూర్తి చేయించి నీళ్లు పారిస్తాం. ఎత్తిపోతల పథకలను సిద్ధం చేస్తున్నాం. సాంకేతిక సమస్యలను గుర్తించి సరిచేస్తున్నాం. –సీఆర్.రాజగోపాల్, ఎస్ఈ, మదనపల్లె

క్లుప్తంగా

మహిళ మెడలో గొలుసు చోరీ

మదనపల్లె : గుర్తు తెలియని వ్యక్తులు మహిళ మెడలో గొలుసు చోరీ చేసిన ఘటన మండలంలో గురువారం రాత్రి జరిగింది. సీటీఎం క్రాస్‌రోడ్స్ పంచాయతీ నల్లగుట్టపల్లెకు చెందిన రమణ భార్య జి.గంగాదేవి(42) గ్రామంలో చిన్నపాటి చిల్లర దుకాణం నిర్వహిస్తూ జీవిస్తోంది. గురువారం రాత్రి దుకాణం మూసివేసి ఇంటికి వెళుతున్న సమయంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు అంగడి వద్దకు వచ్చి వస్తువు కావాల్సిందిగా అడిగారు. ఆమె వస్తువును ఇచ్చే క్రమంలో అటువైపు తిరిగిన వెంటనే మెడలోని గొలుసును ఓ వ్యక్తి బలంగా లాగాడు. ఆమె ప్రతిఘటించడంతో మరింత బలంగా లాగడంతో గంగాదేవి కిందపడి గాయపడింది. దుండగులు బంగారు గొలుసుతో అక్కడి నుంచి పరారయ్యారు. స్థానికుల సహాయంతో ఆమె మదనపల్లె జిల్లా ఆస్పత్రికి చేరుకుని చికిత్సలు పొందింది. చోరీ ఘటనపై తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. బంగారు గొలుసు విలువ రూ.1,20,000గా తెలిపింది.

భర్త వేధిస్తున్నాడని ఫిర్యాదు

రామాపురం : మండలంలోని చిట్లూరు పంచాయతీ కొండవాండ్లపల్లెకు చెందిన మోతాదు మౌనిక తన భర్త వి.ఆర్.గణేష్, అత్త, మామలు ప్రతి రోజు వేధిస్తున్నారని శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కొండారెడ్డి తెలిపిన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మోతాదు మౌనికతో కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నగరం శ్రీనివాసపురానికి చెందిన ఏ.ఆర్.గణేష్‌తో 2021 ఆగస్టు 27న గ్రామ పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. కట్నం కింద 15 తులాలు బంగారు, రూ.2.50 లక్షలు నగదు ఇచ్చారు. తన భర్త బెంగళూరులో వేరే అమ్మాయితో వివాహేతర సంబంధం పెట్టుకొని ప్రతి రోజు శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారని తనకు న్యాయం చేయాలని మోతాదు మౌనిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు


గాయపడ్డ రైతు వెంకటరమణ

మదనపల్లె : రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం పట్టణంలో జరిగింది. కురబలకోట మండలం నల్లపరెడ్డిగారిపల్లెకు చెందిన రైతు ఎస్.వెంకటరమణ(55) ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వస్తుండగా, అమ్మచెరువుమిట్టకు చెందిన మధుకర్(20) డిగ్రీ పరీక్షలు రాసి ఇంటికి వెళుతుండగా.. ఎదురెదురుగా వస్తున్న వీరి ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో వెంకటరమణ, మధుకర్‌లు ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 అంబులెన్స్ వాహనంలో బాధితులను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం వారి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

పడగ విప్పిన ప్రమాదం

• వీరి ఇద్దరి పిల్లలనూ..



వీరి పేర్లు రామాంజనేయులు, అనురాధ. వీరిది సింహాద్రిపురం మండలం అంకాలమ్మగూడూరు గ్రామం. రామాంజనేయులు తొండూరు పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. వీరికి ముగ్గురు సంతానం. నవదీప్(6), భవ్యశ్రీ(4), రెండు నెలల బాబు (ఇంకా పేరు పెట్టలేదు) ఉన్నారు. ఈ నెల 24న రాత్రి సమయంలో వారి ఇంట్లోకి పాము దూరి నిద్రపోతున్న నవదీప్, భవ్యశ్రీని కాటేసింది. ఈ ప్రమాదంలో వారిద్దరూ చనిపోయారు. దీంతో వారి తల్లిదండ్రులు దుఃఖ సాగరంలో మునిగిపోయారు. విధి ఇంత చిన్నచూపు చూస్తుందని అనుకోలేదని, ఇలా ఎవరికీ జరగకూడదని వారు అంటున్నారు.

• గడ్డి మాటున ఉండి..



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు ముక్కమల్ల రవిశంకర్‌రెడ్డి (60). ఈయనది వైఎస్సార్ జిల్లా రాజుపాళెం మండలం టంగుటూరు గ్రామం. ఈ ఏడాది జనవరి 19న పశువులను మేపేందుకు పొలాల్లోకి వెళ్లాడు. గడ్డిలో ఉన్న పాము కాటు వేయడంతో గట్టిగా కేకలు వేశాడు. చుట్టుపక్కల వారు వచ్చి ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందాడు. ఆయనకు భార్య అరుణ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

• పొలంలో వెళ్తుండగా..



అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె పంచాయతీ బుచ్చిరెడ్డిగారిపల్లెకు చెందిన చిన్నప్ప కుమారుడు శ్రీనివాసులు(42) వ్యవసాయ పనులతోపాటు వంట మాస్టర్‌గా పని చేసే వాడు. గ్రామ సమీపంలోని నేలమల్లేశ్వరస్వామి ఆలయ మార్గంలో పొలం వద్ద ఇల్లు కట్టుకుని పనులు చేసుకుంటూ అక్కడే నివసిస్తున్నాడు. ఈ ఏడాది జూలై 15వ తేదీ సాయంత్రం పొలంలో కోసిన టమాటాలను తీసుకువచ్చేందుకు వెళుతుండగా పాము కాలుపై కాటేసింది. తీవ్ర అస్వస్థతకు గురై అతికష్టం మీద ఇంటికి చేరుకుని జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపాడు. వెంటనే వారు 108 అంబులెన్స్ సాయంతో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ మెరుగైన చికిత్సలు అందించినప్పటికీ అప్పటికే విషం శరీరం మొత్తం పాకడంతో పరిస్థితి విషమించి మృతి చెందాడు.

వైఎస్సార్ జిల్లాలో పాము కాటుకు సంబంధించిన కేసులు



సంవత్సరం	కేసులు
2020	1
2021	20
2022	21
2023 (ఇప్పటి వరకు)	10
మొత్తం	52

- వర్షా కాలం... విష పురుగుల సంచారం అధికం
- పంట పొలాలు, ఇంటి పరిసరాల్లో పొంచి ఉన్న ప్రమాదం
- పాము కాటుకు బలైపోతున్న రైతులు, చిన్నారులు
- సింహాద్రిపురం మండలంలో అన్నాచెల్లెళ్లు మృతి
- అప్రమత్తత అవసరం



వర్షా కాలం ప్రారంభమైంది. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో జోరుగా వానలు కురుస్తున్నాయి. ఇప్పటి వరకు భూమిలో ఉన్న వేడి.. ఆవిరి రూపంలో బయటకు వస్తోంది. ఈ క్రమంలో భూమి పొరల్లో ఉండే విష పురుగులు బయటికొస్తున్నాయి. పొలాల్లోనే కాదు.. ఖాళీ మైదానాల్లోనూ.. ఎక్కడో ఓ చోట.. పూటకొకటి బుసలు కొడుతున్నాయ్. చెట్టు, పుట్టల మాటు నుంచి ఏకంగా గుమ్మం దాటి ఇళ్లల్లోకి చొరబడి కాటేస్తున్నాయి. తాజాగా జిల్లాలోని సింహాద్రిపురం మండలం అంకాలమ్మ గూడూరులో ఇంట్లో నిద్రపోతున్న చిన్నారులైన అన్నాచెల్లెళ్లను పాము కాటు వేసింది. వారు మృత్యువుతో పోరాడి ప్రాణాలు కోల్పోయారు. ఇలా ఎందరో అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారు.

కడప డెస్క్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఉమ్మడి జిల్లాల్లో వర్షాలు కురవడం ప్రారంభమయ్యాయి. దీంతోపాటు ఖరీఫ్ సీజన్ కూడా ఆరంభమైంది. ఇక రైతన్నలు పొలం బాట పట్టనున్నారు. దీంతో వారు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా వర్షాల రాకతో పంట పొలాలు, బీడు భూముల్లో పచ్చిక బాగా పెరుగుతుంది. దీంతో విష పురుగులైన పాములు, తేళ్లు గడ్డిమాటున దాగి ఉండే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అదమరిచి ఉన్న వారిని ఇవి కాటేస్తున్నాయి. ఈ కారణంగా ఉమ్మడి జిల్లాల్లో పాము కాటుకు గురై ఆసుపత్రులకు వస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఈ నేపథ్యంలో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యే రైతులు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వర్షాలు కురుస్తున్న కారణంగా ఇంటి పరిసరాల్లోని ఖాళీ స్థలాల్లో పొదలు పెరగడం వల్ల విషపురుగుల సంచారం అధికమైంది. ఒక్కోసారి అవి ఇళ్లలోకి రావడంతో పాము కాటు బాధితుల సంఖ్య ఎక్కువ అవుతోంది.

పాము కరిస్తే లక్షణాలు

- పాము కాటు వేసిన ప్రదేశంలో కోరల గాయం స్పష్టంగా కనిపించి నొప్పి తీవ్రంగా ఉంటుంది.
- నొప్పి క్రమంగా పైకి వ్యాపిస్తూ తిమ్మిరిగా అనిపిస్తుంది.
- పాక్షిక పక్షపాతం కారణంగా నాలుక మందమైనట్టు, గొంతు కండరాలు బిగుసుకున్నట్లుగా గొంతులో ఏది దిగని పరిస్థితి తలెత్తవచ్చు.
- కళ్లు మగతగా, శరీరం మత్తుగా ఉండి స్పృహ కోల్పోవచ్చు.

కడప రిమ్స్‌కు 2022లో 257 పాము కాటు కేసులు వచ్చాయి. వీటిలో రెండు మరణాలు సంభవించాయి. 2023లో ఇప్పటి వరకు 141 కేసులు వచ్చాయి. వీటిలో ఒక మరణం సంభవించింది.

అన్ని పాములు ప్రమాదకరం కాదు..

మన ప్రాంతాల్లో ఉండే పాముల్లో కట్లపాము, నాగుపాము, రక్తపింజరలే ప్రమాదరకమైన సర్పజాతి. వీటితోనే ఎక్కువ ప్రమాదం ఉంటుంది. సాధారణంగా కొన్ని పాముల్లో విషం ప్రభావం తక్కువగా ఉండటంతోపాటు అది కరిస్తే కేవలం గాయం మాత్రమే అవుతుంది. సాధారణ వైద్యంతో నయవుతుంది. పాము కాటు వేసిన చోట గుడ్డ లేదా తాడుతో కట్టు కట్టాలి. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలి. పాము కాటుకు గురైన వ్యక్తులు ఆందోళన చెందకుండా చూసుకోవాలి. ఆందోళన చెందితే గుండెపోటుకు గురయ్యే అవకాశాలుంటాయని వైద్యులు చెబుతున్నారు. ధైర్యంగా ఉంటే ప్రాణాలు రక్షించుకోవచ్చని సూచిస్తున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- రైతన్నలు పొలాల గట్టు మీద వెళ్తున్న సమయంలో కర్రచప్పుడు చేస్తూ నడవడం మంచిది.
- రాత్రి పూట టార్చ్‌లైట్ తీసుకెళ్లాలి.
- కాళ్లకు చెప్పులకు బదులు బూట్లు ధరించాలి.
- పొలాల గట్ల వెంట పొదలు లేకుండా చూసుకోవాలి. ఒక వేళ ఉంటే వర్షాకాలంలో అటు వైపు వెళ్లకపోవడం మంచిది.
- ధాన్యపు బస్తాలు నిల్వ ఉండే చోట ఎలుకలు తిరుగుతూ ఉంటాయి. గడ్డివాములు ఉండే ప్రాంతంలో కూడా ఎలుకలు, కప్పలు తిరుగుతూ ఉంటాయి. వాటిని తినడానికి పాములు అక్కడికి చేరి చెత్తమాటున దాక్కొని ఉంటాయి. కావున గడ్డి వామి దగ్గరకు చప్పుడు చేస్తూ వెళ్లాలి. గడ్డివాముల చుట్టూ శుభ్రంగా ఉంచుకోవాలి. ఇలా చేస్తే విషపురుగుల బెడద తక్కువగా ఉండే అవకాశం ఉంటుంది.
- ప్రథమ చికిత్స పెట్టె, అత్యవసర మందులు వెంట తీసుకెళ్తే మంచిది.
- సాధ్యమైనంత వరకు ఒంటరిగా కాక తోడుగా వెళ్లడం అలవాటు చేసుకోవాలి.

వీలైనంత త్వరగా ఆసుపత్రికి తీసుకెళ్లాలి



పాము కాటుకు గురైన వ్యక్తులకు నాటు మందులు, ఆకు పసరు వంటి వాటిని వేయకూడదు. తక్షణం దగ్గరలోని ప్రభుత్వ లేదా ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లాలి. ముందుగా పాము కాటుకు గురైన వ్యక్తికి రక్తం గడ్డకట్టే విషం ఎక్కిందా, లేక నరాలు బిగుసుకునే విషం ఎక్కిందా అనేది గుర్తించి చికిత్సను ప్రారంభించాలి. అలా చేస్తే ప్రమాదం ఉండదు. ఏది ఏమైనా వీలైనంత త్వరగా చికిత్సను ప్రారంభిస్తే ప్రాణాపాయం అంతగా ఉండదు.

– డాక్టర్ కోటకొండ మనోహర్, వైద్య నిపుణులు, రిమ్స్

అందుబాటులో మందులు



ప్రస్తుత సీజన్‌లో కొద్దిపాటి నీటి ప్రవాహానికి కూడా పాములు, తేళ్లు కొట్టుకుని వస్తాయి. అలాంటి సందర్భాల్లో పాములు ఇళ్లలోకి లేదా బయట పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ ఉంటాయి. పొరపాటున పాముకాటుకు గురైతే తక్షణమే వైద్యులను సంప్రదించాలి. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, కడప ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పాముకాటుకు సంబంధించి యాంటీ స్నేక్ వీనమ్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. అలాగే తేలు కాటుకు కూడా మందులు సిద్ధంగా ఉన్నాయి. ఉచితంగా వైద్య సేవలను పొందవచ్చు. పిల్లలు రాళ్లు, పొదలు, అపరిశుభ్రత ప్రాంతాల్లోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ నాగరాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

నవోదయలో ముగిసిన క్రీడా పోటీలు


వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

రాజంపేట : మండల పరిధిలోని నారనరాజుపల్లిలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో గత రెండు రోజులుగా జరుగుతున్న క్రీడా పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ గీతా వివరాలు వెల్లడించారు. ఈ నెల 27, 28వ తేదీల్లో వాలీబాల్, బాస్కెట్ బాల్, ఫుట్‌బాల్, హ్యాండ్ బాల్ పోటీలు జరిగాయి. ఇందులో కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు, ప్రకాశం, పుదుచ్చేరి నుంచి మొత్తం 416 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ క్రీడలను నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం పది మంది వ్యాయామ ఉపాధ్యాయులను నియమించింది. గత రెండు రోజులుగా జరిగిన ఈ క్రీడల్లో అత్యధికంగా అన్నమయ్య, కడప జిల్లా నుంచి 46, ప్రకాశం జిల్లా నుంచి 45, నెల్లూరు జిల్లా నుంచి 37, కర్నూలు జిల్లా నుంచి 25, పుదుచ్చేరి జిల్లా నుంచి 23, అనంతపురం జిల్లా నుంచి 19, చిత్తూరు జిల్లా నుంచి 9 మంది క్రీడాకారులు దక్షిణ భారత దేశ స్థాయిలో జరగబోయే పోటీలకు ఎంపికయ్యారు. వాలీబాల్‌లో ఎంపికైన క్రీడాకారులు కర్ణాటకలోని హవేరిలో, హ్యాండ్ బాల్‌లో ఎంపికైన క్రీడాకారులు ఆంధ్ర ప్రదేశ్‌లోని విజయనగరం, బాస్కెట్ బాల్‌లో ఎంపికైన క్రీడాకారులు కేరళలోని కాసర్ గడ్, ఫుట్‌బాల్‌లో ఎంపికైన క్రీడాకారులు కేరళలోని త్రిశూర్‌లో జరగబోయే క్రీడా పోటీలలో పాల్గొంటారు. ఇందులో భాగంగా సుబ్రతో కప్ పేరుతో ఫుట్ బాల్ టోర్నీ జరిగింది. అందులో అండర్ 14 బాలుర విభాగంలో ప్రకాశం, అన్నమయ్య, అండర్ 17 బాలుర విభాగంలో నెల్లూరు, ప్రకాశం, బాలికల విభాగంలో అన్నమయ్య, నెల్లూరు ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. ఈ క్రీడా పోటీలను విద్యాలయ ఉప ప్రాధ్యాయులు డి.శ్రీనివాసరావు, మార్గదర్శకత్వంలో స్థానిక విద్యాలయ వ్యాయామ ఉపాధ్యాయులు, అన్నాదురై యాస్మిన్ నిర్వహించారు.

గంజాయి మత్తులో యువకులపై దాడి

- ఐదుగురికి తీవ్ర గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం


గాయపడిన శివశంకర్‌నాయక్, శివకుమార్‌నాయక్


మదనపల్లె : గంజాయి, మద్యం మత్తులో ఓ యువకుల బృందం మరో ఐదుగురు యువకులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన గురువారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. పుంగనూరు మండలం ఊటూరు తండాకు చెందిన శివశంకర్‌నాయక్(23), నల్లగుట్టపల్లె తండాకు చెందిన శివకుమార్‌నాయక్(24) ఇద్దరూ కలిసి ద్విచక్రవాహనంలో మదనపల్లెలోని సినిమా థియేటర్‌లో అడ్వాన్స్ టికెట్లు కొనేందుకు వెళ్లారు. టికెట్లు దక్కకపోవడంతో రాత్రి 10 గంటల సమయంలో స్నేహితులిద్దరూ కలిసి స్వగ్రామాలకు తిరుగు ప్రయాణమయ్యారు. మార్గంమధ్యలో మొలకలదిన్నె గంగమ్మ ఆలయం వద్ద ఓ దుకాణంలో టీ తాగేందుకు ఆగారు. టీ తాగుతుండగా మదనపల్లె మండలం గంగన్నగారిపల్లెకు చెందిన కుమార్(19), ఉదయ్(20), మొరాలకు చెందిన మహేష్(21), మరో పది మందికి పైగా మిత్రులతో కలిసి అక్కడికి వచ్చారు. అప్పటికే వారు గంజాయి, మద్యం సేవించి ఉన్నారు. టీ తాగుతున్న శివశంకర్, శివకుమార్ నాయక్‌లపై కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. దీంతో వారిద్దరూ... మీరెవరో మాకు తెలియదని, మాది ఈ ప్రాంతం కాదని, టీ తాగేసి వెళ్లిపోతామని చెప్తుండగా... ఒక్కసారిగా వారిపై యువకుల గుంపు మూకుమ్మడిగా దాడిచేసింది. రాడ్‌లు, కర్రలతో విచక్షణారహితంగా కొట్టారు. దాడిలో తీవ్రంగా గాయపడిన శివకుమార్, శివశంకర్‌నాయక్‌లు స్వగ్రామంలోని మిత్రులకు సమాచారం తెలిపి ఆస్పత్రికి తీసుకెళ్లాల్సిందిగా కోరారు. దీంతో వారికోసం సుగాలిమిట్టకు చెందిన మహేంద్రనాయక్(22), బాలాజీనాయక్(23), రమేష్ నాయక్(29) ముగ్గురూ కలిసి మిత్రులను కాపాడేందుకు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడే ఉన్న రౌడీమూకలు వచ్చిన ముగ్గురినీ వదిలిపెట్టకుండా మొత్తం ఐదుగురినీ చితకబాదారు. దాడిలో తీవ్రగాయాల పాలైన ఐదుగురు బాధితులు స్థానికుల సహాయంతో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి చేరుకున్నారు. మహేంద్రనాయక్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం స్థానిక వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. దాడి ఘటనపై బాధితులు తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడదాం


అనంతపురం గంగమ్మను దర్శించుకుంటున్న పీఠాధిపతి రుద్రాక్షస్వామి

లక్కిరెడ్డిపల్లి : హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని తమిళనాడు అరుణాచల యమలింగ సమీపాన వెలసిన పంచలింగేశ్వర పీఠాధిపతి రుద్రాక్ష స్వామీజీ పేర్కొన్నారు. అనంతపురంలో వెలసిన శ్రీశ్రీ అనంతపురం గంగమ్మతల్లిని ఆయన శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ సామాల నరసింహారెడ్డి, సర్పంచ్ కళ్యాణి ప్రభాకర్‌రెడ్డి, వెంకటనారాయణరెడ్డి, పూజారులు చెల్లు సురేంద్ర యాదవ్, రెడ్డి శేఖర్‌లు స్వామీజీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆయన గంగమ్మ దేవత అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు గంగమ్మ దేవత ప్రవచనాలు, అమ్మవారి విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో హిందూ ధర్మ పరిరక్షణ సేవా సమితి మల్లికార్జున, రామచంద్ర, సుధీర్ బాబు, అంజనేయులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సౌమ్యనాథస్వామిని దర్శించుకున్న జడ్జిలు


సౌమ్యనాథస్వామి ఆలయంలో జడ్జిలు

నందలూరు(రాజంపేట) : నందలూరులోని శ్రీసౌమ్యనాథస్వామిని వైఎస్సార్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ పి.ప్రదీప్‌కుమార్, సీనియర్ సివిల్ జడ్జి పి.కవితలు కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. నందలూరు కోర్టు జడ్జి కె.లతా ఆధ్వర్యంలో ఆలయ పూజారులు వారికి స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

చిట్వేలి : రోడ్డు ప్రమాదంలో చిట్వేలి మండలం కొత్తపల్లికి చెందిన మురళీకృష్ణ (27) మరణించాడు. చిట్వేలి నుంచి కొత్తపల్లికి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా గారరుమీద పల్లి పాలకేంద్రం వద్ద ఆగి బొప్పాయి కాయలను లోడ్ చేసుకుంటున్న లారీని ఢీకొని యువకుడు మృతి చెందాడని ఎస్సై సుభాష్ చంద్ర పేర్కొన్నారు. కేసు నమోదు చేసి శవ పరీక్ష కోసం మృతదేహాన్ని తరలించమన్నారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం

- జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి
- చిన్నమండెంలో ఘనంగా బాసితం


పీర్లచావిడి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ దేవనాథరెడ్డి

చిన్నమండెం : త్యాగానికి, మంచితనానికి ప్రతీకగా మొహర్రం వేడుకలు నిలుస్తాయని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి అన్నారు. శుక్రవారం చిన్నమండెం పీర్లచావిడిలో మొహర్రం సందర్భంగా దేవనాథరెడ్డి కడప పెద్దదర్గా పీఠాధిపతి హజరత్ ఆరీఫుల్లాహుసేనితో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గురువు హజరత్ ఆరీఫుల్లాహుస్సేని ఆశీర్వదించి, సత్కరించి ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా దేవనాథరెడ్డి మాట్లాడుతూ ప్రవక్త మనువడు హజరత్ ఇమామ్ హుసేన్ చేసిన త్యాగానికి గుర్తుగా మొహర్రం జరుపుకొంటున్నామన్నారు. ప్రశాంతంగా మొహరం వేడుకలను జరుపుకోవాలన్నారు. ధర్మపరిరక్షణ, మానవ సేవ, త్యాగం వంటి మహత్తర సందేశాలను మొహర్రం గుర్తు చేస్తుందన్నారు. ఏజాసేలీఖాన్ తండ్రి సవాద్ అలీఖాన్ పీర్లకు బాసికం అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఏజాస్‌అలీఖాన్, మాజీ సర్పంచ్ సలీం, గౌస్‌సాబ్, రమేష్, రహంతుల్లా, యేహియాఖాన్, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ చుక్కా అంజనప్ప, జమీర్, సాదిక్, సారుల్లా, సుగతుల్లా, సజాద్, అజ్రు తదితరులు పాల్గొన్నారు.

భారీ బందోబస్తు

పీర్లమకాన్‌లో బాసికం సందర్భంగా రాయచోటి రూరల్ సీఐ లింగప్ప ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్ఐలు, 70 మంది పోలీసులతో సీఐ లింగప్ప ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రూ.1.37 కోట్లతో ఎస్సీ రైతులకు విత్తనాల సరఫరా


విత్తనాల కిట్లు పంపిణీ చేస్తున్న జేసీ, ఎస్సీ మాల కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్

రాయచోటి : జిల్లాలో 1368 మంది ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్సీ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రూ.1.37 కోట్ల ఖర్చుతో విత్తనాలను సరఫరా చేస్తామని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి అనుసూచిత జాతి అభ్యుదయ యోజన పథకం (పీఎంఏజేఏవై) కింద అన్నమయ్య జిల్లాలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న షెడ్యూల్ కులాలకు చెందిన రైతులకు విత్తనాల కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎస్సీ మాల కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తోందని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు సాధికార సంస్థ జిల్లా వ్యాప్తంగా గ్రామాలలో సేంద్రీయ పద్ధతిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న 1368 మంది ఎస్సీ రైతులను గుర్తించడం జరిగిందన్నారు. ఈ మేరకు నేడు ఒక్కొక్కరికి రూ.10 వేల విలువ చేసే వివిధ విత్తనాల కిట్లను రాయితీతో సరఫరా చేశామన్నారు. ఇందులో జొన్నలు, మొక్కజొన్న, జీలుగలు, పిల్లిపెసర, జనుములు, రాగి, కొర్ర, సజ్జ, ప్రొద్దుతిరుగుడు, మినుములు, పెసలు, కందులతోపాటు కిచెన్ గార్డెన్ కిట్ తదితరాలు ఉంటాయన్నారు. ఈ కిట్లను రైతులు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు. సాగు చేసే పొలంలో కనీసం 20 సెంట్లలో ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి ఎస్సీ రైతు అదనపు ఆదాయ వనరులు ఏర్పరుచుకోవాలని పేర్కొన్నారు. ఎస్సీ మాల కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ ఎం. శ్రీనివాసులు మాట్లాడుతూ ఎస్సీ వర్గాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ నిధులతో రాష్ట్ర విత్తనాల అభివృద్ధి కార్పొరేషన్ ద్వారా రైతులకు విత్తనాలు, పీఎండీఎస్ కిట్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అలాగే ఒక్కొక్క ఎస్సీ రైతుకు రూ.1870 విలువజేసే సీడ్ టు సీడ్ కిట్లు, గట్ల మీద వేయుటకు కంది, కిచెన్ గార్డెన్ కిట్లను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ హెచ్ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ ఈ పథకంలో భాగంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్సీ రైతులు జిల్లాలో ఇంకా ఎవరైనా ఉంటే తమ కార్యాలయాన్ని లేదా క్షేత్ర స్థాయిలో ఆర్బీఎస్‌ఎఫ్ డీపీఎంను సంప్రదించాలని సూచించారు. అలాగే కార్పొరేషన్ ద్వారా ఒక్కొక్క ఎస్సీ రైతుకు రూ 7680 విలువ కల్గిన ఇతర అవసరమైన వ్యవసాయ ఉపకరణాలు, ఫెరామిన్ ట్రాప్స్, లూర్స్, ఎల్లో స్టికీ ప్లేట్స్, టార్పాలిన్స్, డ్రమ్ములు మొదలుగునవి కూడా త్వరలో పంపిణీకి చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం యశోదమ్మ, షెడ్యూల్ కులాల రైతులు తదితరులు పాల్గొన్నారు.